క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలో సెంట్రల్ లైటింగ్ కనెక్షన్, నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నందున శనివారం ఉదయం 6.30 గంటల నుంచి 7:30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సీతారాములు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

టీసీఎస్ ఫీడర్ పరిధిలో..

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల టీసీఎస్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా కొంగరకలాన్, టీసీఎస్ ప్రాంతాల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి 8:30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మంగళ్‌పల్లి సబ్‌స్టేషన్ ఏఈ జయన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

తుర్కయంజాల్ సబ్‌స్టేషన్ పరిధిలో..

తుర్కయంజాల్: తుర్కయంజాల్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 6 గంటల నుంచి 6.30 గంటల వరకు లక్ష్మీ మెగా టౌన్‌షిప్, పాటిగూడ పరిసర ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. అదేవిధంగా గుర్రంగూడ ఫీడర్ పరిధిలోని గుర్రంగూడ గ్రామం, పరిసర కాలనీల్లో ఉదయం 6.30 గంటల నుంచి 7 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు సర్వసభ్య సమావేశం

ఇబ్రహీంపట్నం: ఉప్పరిగూడ పీఏసీఎస్ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహిస్తున్నట్లు సీఈఓ శుక్రవారం ఒక ప్రకటనలో గణేశ్ తెలిపారు. చైర్మన్ పాండు రంగారెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి వైస్ చైర్మన్, డైరెక్టర్లు, సంఘం సభ్యత్వం కలిగిన వారందరూ హాజరుకావాలని కోరారు.

ఆర్థికసాయం అందజేత

తలకొండపల్లి: మండల పరిధిలోని ఆర్లకుంట తండాకు చెందిన జరుపులావత్ భీముడు (63) అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందాడు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి తండాకు వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.3000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో భీంలాల్, శ్రీరామ్, అభిషేక్, శ్రీను, గోపి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా చందు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రూ.3000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఎన్‌యస్‌యూఐ మండల అధ్యక్షుడు రమేష్, పాల్గొన్నారు.

నిరుపేద యువతి వివాహానికి..

యాచారం: పేదలకు సహాయం చేయడం ఎంతో తృప్తి ఇస్తుందని మంతన్‌గౌరెల్లి ఎంపీటీసీ సభ్యురాలు జ్యోతినాయక్ పేర్కొన్నారు. గ్రామంలోని రాంచందర్ రెండో కూతురు రాజేశ్వరి వివాహం శనివారం జరగనున్న దృష్ట్యా శుక్రవారం రాంచందర్ ఇంటికెళ్లిన ఎంపీటీసీ జ్యోతి.. క్వింటాల్ బియ్యం, పట్టుచీరను అందజేశారు. గ్రామస్తులు అఖిల్ ఖాన్, సోమయ్య, రాములు,రవి, సీతారామ్, సత్యం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్స్‌లను రెన్యూవల్ చేసుకోండి

తుర్కయంజాల్: 2024–25 ఆర్థిక సంవత్సరం ట్రేడ్ లైసెన్స్‌లను ఈ నెల 31వ తేదీ లోపు ముందస్తుగా రెన్యూవల్ చేసుకోవాలని పుర కమిషనర్ సత్యనారాయణ రెడ్డి తెలిపారు. ఏప్రిల్ 1వ తేదీ తరువాత రెన్యూవల్ చేసుకుంటే 25 శాతం పెనాల్టీ విధించబడుతుందని తెలిపారు. శుక్రవారం స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రెన్యూవల్ చేసుకున్న పలువురు వ్యాపారులను కమిషనర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, సిబ్బంది మల్లారెడ్డి, భానుమతి పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా లోకల్ 15, వంకాయ 18, బెండ 40, పచ్చిమిర్చి 55, కాకర 35, బీర 45, క్యాలీఫ్లవర్ 18, క్యాబేజీ 21, క్యారెట్ 23. దొండ 28, ఆలు 27, ఉల్లి 22, గోకర 35, దోస 16, సొర 09, పొట్ల 18, అరటి 09, చిక్కుడు 55, అర్వి 35, మునగ 28, చిలగడదుంప 65, బీట్‌రూట్ 23, కీర 23, ఫ్రెంచ్ బీన్స్ 50, కాప్సికమ్ 70. ఈధరలు శనివారం 9 గంటల వరకు మాత్రమే ఈధరలు అమలులో ఉంటాయి.

భర్త ఇంటి ఎదుట భార్య ధర్నా

హస్తినాపురం: తెలంగాణ రాష్ట్ర ఆర్‌టీసీ యూనియన్ నాయకుడు రాజిరెడ్డి ఇంటి ముందు ఆయన కోడలు పావని మహిళా సంఘాలతో కలిసి శుక్రవారం ధర్నా చేసింది. రాజిరెడ్డి కుమారుడు కార్తీక్ రెడ్డి పెళ్లి గత సంవత్సరం మే 21న పావనితో జరిగిందని.. అయితే తనను కాపురానికి తీసుకెళ్లలేదని వాపోయింది. అత్తగారింటికి వస్తే ఇంట్లోకి అనుమతించకుండా ఇంటికి తాళం వేసుకుని వెళ్లిపోయారని ఆరోపించింది. పెళ్లి సమయంలో తనకు తన తల్లి పెట్టిన బంగారు ఆభరణాలను తీసుకొని ఇవ్వడంలేదని పావని ఆరోపించారు. తన మామ రాజిరెడ్డి బెదిరింపులకు పాల్పడుతున్నాడని పావని ఆరోపించారు. ఈ విషయంపై రాజిరెడ్డి మాట్లాడుతూ..కోడలికి చర్మ సంబంధ వ్యాధి ఉందని తమకు ఎలాంటి కట్నం ఇవ్వలేదని చర్మవ్యాధి ఉన్న విషయం చెప్పకుండా దాచిపెట్టి పెళ్లి చేయడంతోనే సమస్యలు వస్తున్నాయన్నారు. తాము న్యాయపరంగానే సమస్యను పరిష్కరించుకుంటామని అన్నారు.

అత్యవసరమైతే.. ఆరుబయటే

- అబ్దుల్లాపూర్‌మెట్‌లో సులభ్ కాంప్లెక్స్ లేక ప్రజల అవస్థలు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



అబ్దుల్లాపూర్‌మెట్ ప్రధాన రహదారి

అబ్దుల్లాపూర్‌మెట్: నగరానికి దీటుగా దినదినాభివృద్ధి చెందుతున్న అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలో సులభ్ కాంప్లెక్స్ లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సుమారు 20 గ్రామాలకు ప్రధాన కూడలితో పాటు జాతీయ రహదారి మార్గం ఉండటంతో ఈ మండల కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం నిత్యం వేలాది మంది రాకపోకలు కొనసాగిస్తుంటారు. వీరితో పాటు పదుల సంఖ్యలో దుకాణ సముదాయాలు ఇక్కడ ఉన్నాయి. దీంతో నిత్యం వేలాది మంది ఇక్కడి వస్తుంటారు. అత్యవసరం సమయంలో సులభ్ కాంప్లెక్స్ సౌకర్యం లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో ఇక్కడ సులభ్ కాంప్లెక్స్ నిర్మాణం కోసం మండల పరిషత్ నుంచి నిధులు మంజూరు అయినప్పటికీ అనువైన స్థలం లభించకపోవడంతో నిర్మాణం వాయిదా పడుతూ వస్తోంది. కొత్త మండల ఆవిర్భావం తర్వాతైనా సులభ్ కాంప్లెక్స్ నిర్మాణం చేడతారా అని చూసినప్పటికీ ఇంకా నిర్మాణం చేపట్టకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అన్ని కార్యాలయాలు ఉన్నప్పటికీ..

కొత్త మండలం ఆవిర్భావం తర్వాత ఇక్కడ పోలీస్ స్టేషన్, తహసీల్దార్ కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఏర్పాటు కావడంతో ఆయా కార్యాలయాలకు వచ్చేవారి సంఖ్య కూడా పెరుగుతూ వస్తోంది. సులభ్ కాంప్లెక్స్ నిర్మాణాన్ని సత్వరమే చేపట్టాలని ప్రజాప్రతినిధులను కోరినా ప్రయోజనం లేదని ప్రజలు వాపోతున్నారు. ఆరుబయటే వెళ్లాల్సిన పరిస్థితి. పురుషులైతే బైక్‌పై కిలోమీటర్ దూరం వెళ్లి వస్తుంటారు... మరి మహిళల పరిస్థితి అత్యంత దారుణంగా ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మూత్రశాలలు నిర్మించాలి

మా సొంతూరు దండుమైలారం.. గత కొంతకాలంగా ఇక్కడ కిరాణాదుకాణం కొనసాగిస్తున్నాం. మూత్రశాలలు లేకపోవడం వల్ల ప్రతిరోజు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. మా షాప్ దగ్గర ఎలాంటి సదుపాయం లేకపోగా ఎక్కడ చూసినా జనావాసాలు ఉండటంతో అత్యవసర సమయాల్లో నరకం అనుభవించాల్సి వస్తోంది. వెంటనే మూత్రశాలలు నిర్మించాలి. స్థానిక నాయకులు, అధికారులు చొరవ చూపాలి. – సుగుణమ్మ, కిరాణా దుకాణం నిర్వాహకురాలు, అబ్దుల్లాపూర్‌మెట్

డబుల్ రోడ్డు పనులు ప్రారంభం



తుమ్మలూరులో కొనసాగుతున్న బీటీ రోడ్డు పనులు

మహేశ్వరం: తుమ్మలూరు బీటీ డబుల్ రోడ్డు నిర్మాణ పనులను ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారుల ఆదేశాలతో శుక్రవారం కాంట్రాక్టర్ పనులను ప్రారంభించారు. ఈ రోడ్డు నిర్మాణానికి గత ప్రభుత్వంలో రూ.14.20 కోట్లు మంజూరయ్యాయి. తుమ్మలూరు గేటు–మహేశ్వరం వయా తుమ్మలూరు వరకూ రెండు వరుసల బీటీ రోడ్డు నిర్మాణానికి మట్టి, కంకర పరిచి వదిలేశారు. ఈ క్రమంలో రోడ్డు నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంతో గ్రామ యువకులు ఇటీవల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తెలంగాణ చీఫ్ ఇంజనీర్ మోహన్ నాయక్‌ను కలిసి రోడ్డు నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించాలని కోరారు. దీంతో మంత్రి, చీఫ్ ఇంజనీర్ ఆర్‌అండ్‌బీ డీఈ, రోడ్డు కాంట్రాక్టర్‌తో మాట్లాడి నిలిచిపోయిన రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభింపజేశారు. వీలైనంత త్వరగా మట్టి, కంకర పరిచిన చోట డాంబర్ వేసి రోడ్డు పనులు వేగంగా చేస్తామని కాంట్రాక్టర్ హామీ ఇచ్చాడు. దీంతో అక్కడ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ రోడ్డు పనులు పునఃప్రారంభం కావడంతో గ్రామస్తులు, యువకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా తిరు కల్యాణం



కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి కొహెడలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం తిరుకల్యాణాన్ని నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని వీక్షించారు.

నేటినుంచి ప్రతిష్ఠాపనోత్సవాలు

తలకొండపల్లి: మండల పరిధిలోని చీపునుంతలలోని శివ సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో నేటి నుంచి ఏప్రిల్ 1 వరకు ప్రతిష్ఠాపన ఉత్సవాలు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు బాలకుమార్ గౌడ్, నరోత్తంరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఆలయంలో హనుమాన్ చాలీసా, శివ స్తోత్ర, రామానామ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహఖులు కుమార్, నరోత్తంరెడ్డి పాల్గొన్నారు.

మహమ్మాయి దేవి రథోత్సవాలు ప్రారంభం

అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధిలోని మజీద్‌పూర్‌లో గల శ్రీ మహమ్మాయిదేవి ఆలయ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి ప్రారంభమయ్యాయి. మొదటి రోజు రథోత్సవం నిర్వహించారు. ఈ ఉత్సవాలు మూడు రోజులపాటు నిర్వహిస్తామని నిర్వాహకులు ఎర్రవెల్లి మారుతీప్రసాద్ తెలిపారు. ఆదివారం కల్యాణోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు. భక్తులు విజయవంతం చేయాలని కోరారు.

శివగంగ ఆలయంలో ప్రత్యేక పూజలు

మహేశ్వరం: శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో భక్తులు అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, మంత్ర పుష్పం తదితర పూజలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అల్లె కుమార్, డైరెక్టర్లు, ఆలయ ప్రధాన పూజారులు పాల్గొన్నారు.

అన్నదానం మహాదానం

మాజీ సర్పంచ్ శ్రీశైలం



అన్నదానం నిర్వహిస్తున్న మాజీ సర్పంచ్ శ్రీశైలం

తలకొండపల్లి: అన్ని దానాలోకెల్లా అన్నదానం గొప్పదని మాజీ సర్పంచ్ శ్రీశైలం అన్నారు. సంపాదించిన దాంట్లో కొంత అనాథలు, పేదలకు దానం చేయాలన్నారు. మండల పరిధిలోని దేవుని పడకల్ శ్రీ వేంకటేశ్వర దేవాలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం వాలీబాల్ యూత్ అసోషియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ మెన్స్ అండ్ ఉమెన్స్ సీనియర్, జూనియర్, గరల్స్ విభాగాల్లో క్రీడా పోటీలు నిర్వహించారు. సుమారుగా 70కి పైగా టీంలు పాల్గొన్నాయి. జున్న సోలార్ అధినేత జున్న శేఖర్‌రెడ్డి శుక్రవారం ఆలయంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మాజీ సర్పంచ్ శ్రీశైలం ముఖ్య అతిథిగా హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పీఈటీ మల్లేశ్, వాలీబాల్ యూత్ అసోసియేషన్ క్రీడా నిర్వాహకులు మహేశ్, తిరుపతి, రాజు, వెంకటేష్, సత్యం, నర్సింహ, శ్రీశైలం, జంగయ్య, బాలు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

'పెండింగ్ సమస్యలు పరిష్కరిస్తా'



పైపులైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను దశలవారిగా పరిష్కరిస్తున్నట్లు జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి స్పష్టంచేశారు. డివిజన్ పరిధిలోని ఆగమయ్యనగర్ కాలనీలోని జరుగుతున్న వరదనీటికాలువపైపులైన్ పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ..వర్షాకాలంలో మురుగు నీరు, వరదనీరు కలిసి ప్రవహిస్తుండటంతో గణేష్ నగర్, సాయినాథ్‌కాలనీ, మల్లీఖార్జుననగర్‌కాలనీ వాసులు ఇంట్లో నుంచి బయటకు రాలేని పరిస్థితి ఉందని, దీర్ఘకాలిక సమస్యను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు అభివృద్ధికి సహకరిస్తే పనులు వేగవంతంగా పూర్తి అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు వెంకటేష్ , వెంకట్‌రెడ్డి, ఆనందం,నరేష్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, రమేష్, మల్లేష్‌యాదవ్, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లో చేరిక

హుడాకాంప్లెక్స్: బీఆర్‌ఎస్ పార్టీ సరూర్‌నగర్ డివిజన్ సోషల్ మీడియా ఇన్‌చార్జి మొగిళ్ల మల్లేశ్ పదవికి రాజీనామా చేసి చేవెళ్ల లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి సమక్షంలో సరూర్‌నగర్ డివిజన్ నాయకులు బేర బాలకిషన్, ఆకుల అరవింద్ ఆధ్వర్యంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. బాలకిషన్ మాట్లాడుతూ.. సరూర్‌నగర్, ఆర్‌కేపురం డివిజన్లలో గతంలో మంత్రిగా ఉన్న సబితారెడ్డి కార్యకర్తలు, నాయకులను అసలు పట్టించుకోలేదని.. త్వరలోనే రెండు డివిజన్లకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు కూడా కాంగ్రెస్‌లో చేరతారని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి పాల్గొన్నారు.

అన్నదాతలకు అండగా ఉంటా

పీఏసీఎస్ చైర్మన్ పాండు రంగారెడ్డి



ఇబ్రహీంపట్నం: అన్నదాతలకు అండగా ఉంటానని ఉప్పరిగూడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్) నూతన చైర్మన్‌గా ఎన్నికైన పాండు రంగారెడ్డి అన్నారు. 'సాక్షి'కి శుక్రవారం ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ప్రత్యేకంగా మీకోసం..

ప్రశ్న: సంఘంలో ఎంత మంది సభ్యత్వం కలిగి ఉన్నారు.

జవాబు: 3,210 మందికి సంఘంలో సభ్యత్వం ఉంది.

ప్రశ్న: రుణాలు అందజేస్తున్నారా?

జవాబు: రుణాలు అవసరమున్న రైతులందరికీ మంజూరు చేస్తున్నాం.

ప్రశ్న: కాంగ్రెస్ ఆరు గ్యారంటీల హామీలో భాగంగా రూ.2 లక్షల రుణామాఫీకి ఎంత మంది అర్హులుగా ఉన్నారు?

జవాబు: మా సంఘంలో 1,206 మంది క్రాప్ లోన్ తీసుకున్న రైతులు అర్హులుగా ఉన్నారు.

ప్రశ్న: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయంలో రైతు రుణమాఫీ అందరికీ జరిగిందా?

జవాబు: 30శాతం మంది రైతులకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయంలో రుణమాఫీ జరగలేదు. వారికి న్యాయం జరిగేందుకు కృషిచేస్తాం.

ప్రశ్న: కొత్త స్కీంలు ఏవైనా ప్రవేశపెడుతున్నారా?

జవాబు: హౌసింగ్ రుణాలు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నాం. త్వరలో అమలుపరుస్తాం.

ప్రశ్న: పీఏసీఎస్ పరిధిలో గోడౌన్ నిర్మాణం, రైస్‌మిల్లు నిర్మాణ పనులు ఎంత వరకు వచ్చాయి?

జవాబు: సీతారాంపేట వద్ద పీఏసీఎస్ ఆధ్వర్యంలో రూ.1.50 కోట్ల నాబార్డ్ నిధులతో గోడౌన్ నిర్మాణం పూర్తయ్యింది. రూ.2.50 కోట్లతో రైస్‌మిల్లు నిర్మాణం చేపడుతున్నాం. షెడ్ నిర్మాణం పూర్తయ్యింది. రైస్‌మిల్లు యంత్రాలు రావాల్సి ఉంది.

ప్రశ్న: ఎప్పటిలోగా రైస్‌మిల్లు పనులు పూర్తిచేస్తారు?

జవాబు: రైస్‌మిల్లు పనులు త్వరిగతిన పూర్తి చేసి... రెండు నెలల్లో ప్రారంభించి అందుబాటులోకి తీసుకొస్తాం.

ప్రశ్న: ప్రస్తుతానికి ఏఏ రుణాలు అందజేస్తున్నారు?

జవాబు: రైతులకు స్వల్ప, దీర్ఘకాలిక రుణాలను అందజేస్తున్నాం. గోల్డ్‌లోన్స్ కూడా ఇస్తున్నాం.

ప్రశ్న: సంఘం లాభాల బాటలో ఉందా?

జవాబు: జిల్లాలోనే ఉప్పరిగూడ పీఏసీఎస్ నంబర్ వన్‌గా ఉంది. లాభాల బాటలో ముందు వరసలో ఉంది.

ప్రశ్న: రైతులకు మీరిచ్చే సందేశం?

జవాబు: రైతులకు పీఏసీఎస్ తరపున అన్ని విధాలుగా అండగా ఉంటాం. ఏ సమస్య వచ్చినా రైతులు నేరుగా కార్యాలయంలో సంప్రదించవచ్చు. సంఘం అభివృద్ధి పథంలో పయనించాలంటే సభ్యులందరి సహకారం ఎంతో ముఖ్యం.

తుక్కుగూడ జనజాతరకు తరలిరావాలి

కాంగ్రెస్ నేత నర్సింహా

కడ్తాల్: లోక్‌సభ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ఏప్రిల్ 6న తుక్కుగూడలో నిర్వహించనున్న 'జన జాతర శంకరావ సభ'ను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, కార్యకర్తలకు ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల పరిధిలోని మక్తమాధారం గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తుక్కుగూడ రాజీవ్ గాంధీ ప్రాంగణంలోనే గత తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన ఆరు గ్యారంటీలను ప్రకంటించుకున్నామని, లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి జాతీయ స్థాయి గ్యారంటీలను కూడా తుక్కుగూడ సభలోనే కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకులు ప్రకటించనున్నారని తెలిపారు. ఈ సభకు కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకులు రాహుల్‌గాంధీ, జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో పాటు, వివిధ రాష్ట్రాల కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రులు, అగ్ర నాయకులు తరలిరానున్నారని తెలిపారు. సభకు కల్వకుర్తి నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, నాయకులు తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ కిసాన్‌సెల్ మండల అధ్యక్షులు బాలరాజు, నాయకులు కృష్ణానాయక్, పవన్ తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మిక కార్యక్రమాలతో భక్తిభావం

సీజీఆర్ చైర్‌పర్సన్ లీలాలక్ష్మారెడ్డి



కుంకుమార్చన నిర్వహిస్తున్న భక్తులు

కడ్తాల్: ఆధ్యాత్మిక కార్యక్రమాలతో భక్తి భావం పెంపొందుతుందని కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ చైర్‌పర్సన్ లీలాలక్ష్మారెడ్డి అన్నారు. మండల పరిధిలోని అన్మాస్‌పల్లి సమీపంలో నూతనంగా నిర్మించిన జ్ఞాన సరస్వతీమాత శక్తిపీఠం వద్ద వేదపండితులు వెంకటేశ్వరశర్మ పర్యవేక్షణలో జ్ఞాన ప్రసున్నాంబ ఆధ్వర్యంలో మహిళలు లలితాసహస్రనామ పారాయణం, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఈ మేరకు శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక పూజ కార్యక్రమాలకు లీలా లక్ష్మారెడ్డి హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమాలు ఏప్రిల్ 30 వరకు కొనసాగుతాయని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శంకర్, ఆలయ అర్చకుడు పంకజ్ శర్మ, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పర్వతాలు, పెద్ద కిష్టయ్య, రాజుగౌడ్ పాల్గొన్నారు.

ఓటర్లను చైతన్యం చేస్తున్నాం

సర్కిల్–6 ఎన్నికల అధికారి జయంత్



చాదర్‌ఘాట్: ఓటరు నమోదుకు ఇంకా అవకాశం ఉందని వచ్చే నెలలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అవుతున్న నేపథ్యంలో అర్హులైన వారందరినీ ఓటర్లుగా నమోదు చేయించే క్రమంలో ఓటర్లను చైతన్యం చేస్తున్నామని మలక్‌పేట సర్కిల్–6 ఎన్నికల అధికారి జయంత్ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం మలక్‌పేటలోని ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ, కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతుందని తెలిపారు. మే 13న పోలింగ్ జరుగుతున్న నేపథ్యంలో నామినేషన్ ప్రక్రియకు ముందు వరకు నమోదు ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. అర్హులైన వారిని అందరినీ చేర్చే క్రమంలో జీహెచ్‌ఎంసీ అధికారులతో పాటు,బీఎల్‌ఓలు, మహిళా సంఘాలు, యువజన సంఘాలు, కాలనీ సంక్షేమ సంఘాలు, బస్తీ సంఘాలను ముందు చైతన్యం చేస్తున్నామని తెలిపారు. వచ్చే నెల వరకు 18 ఏళ్లు నిండిన వారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇప్పటికే విడుదల అయిన తుదిజాబితాకు వారందరి పేర్లు అదనపు జాబితాలో నమోదు అవుతున్నాయని తెలిపారు. ఓటరు నమోదు ప్రక్రియలో ఇబ్బందులు ఉంటే సర్కిల్ కార్యాలయంలో పరిష్కరించుకోవాలి. ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఏసు చూపిన మార్గంలో నడవాలి

కల్వకుర్తి, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల పరిధిలోని చర్చిల్లో గుడ్‌ఫ్రైడేను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పాస్టర్లు ప్రత్యేక సందేశం వినిపించారు. ఏసుక్రీస్తు ద్వారా సర్వమానవాళికి రక్షణ, విమోచన, శాంతి, సమాధానం వచ్చిందని.. ఆయన చూపిన మార్గంలో అందరూ నడవాలని కోరారు. యేసు త్యాగాన్ని గుర్తుంచుకోవాలని అన్నారు. – సాక్షి, నెట్‌వర్క్



ఆమనగల్లు: సందేశం ఇస్తున్న పాస్టర్ లక్ష్మణ్‌నాయక్



హయత్‌నగర్: ఏసు గీతాలు ఆలపిస్తున్న బృందం



మంచాల: మంచాల చర్చిలో..



మాడ్గుల: బ్రాహ్మణపల్లి చర్చిలో..